క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

మహేశ్వరం: మండల పరిధిలోని అవేర్, లోహియా, హర్షగూడ, శ్రీనగర్, ఎంపైర్, నందిపల్లి, అనాలాజిక్, నాగారం, శివగంగ ఆలయం, పెంద్యాల, మన్సాన్‌పల్లి, బసగూడ, అపర్ణ, కేబీ తండా, ఎలక్ట్రానిక్ సిటీ, మొహబ్బత్‌నగర్ తండాల్లో ఒక్కో ఫీడర్లలో 30 నిమిషాల పాటు విద్యుత్ సరఫరాను శనివారం ఉదయం 6:30 గంటల నుంచి 8:30వరకు నిలిపివేస్తున్నామని ఏఈ చక్రపాణి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త సర్వీసులు రిలీజ్ చేయుటకు గాను విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని దీనికి రైతులు, వ్యాపారులు, వినియోగదారులు అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

తుక్కుగూడలో..

తుక్కుగూడ: మహేశ్వరం మండల పరిధిలోని శ్రీనగర్, హర్షగూడ, నందిపల్లి, పెంద్యాల, మనసాన్‌పల్లి, బసాగూడ తండా, కేబీ తండా, నాగారం, మొహబత్‌నగర్లలో శనివారం ఉదయం 6:30 నుంచి 8:30 వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ చక్రపాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కొక్క ఫీడర్లో 30 నిముషాల పాటు, కొత్త సర్వీసులు రిలీజ్ చేయుటకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. దీనికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయండి



సమాఖ్య సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

కుల్కచర్ల: పాఠశాలల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు వేగవంతంగా నిర్వహించేలా అమ్మ ఆదర్శ కమిటీలు పనిచేయాలని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మహిళా సమాఖ్య సిబ్బందితో ఆయన మాట్లాడారు. పాఠశాలలు ప్రారంభమైయ్యే నాటికి మౌలిక సదుపాయాల కల్పన పూర్తి కావాలని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎం శోభ, ఎంఈఓ హబీబ్ అహ్మద్, మహిళా సమాఖ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు పామాయిల్ సాగుపై అవగాహన

కందుకూరు: పామాయిల్ తోటల సాగుపై కందుకూరు రైతు వేదికలో శనివారం అవగాహన నిర్వహించనున్నట్లు ఉద్యానశాఖ అధికారి సౌమ్య శుక్రవారం తెలిపారు. పామాయిల్ సాగు ఏవిధంగా చేపట్టాలి, మార్కెట్ సదుపాయం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని అందరూ సకాలంలో హాజరు కావాలని కోరారు.

డిగ్రీ కాలేజీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీపాద శార్వాణి ఒక ప్రకటనలో కోరారు. ఆమనగల్లు పట్టణంలో గతేడాది ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేశారన్నారు. ఈ ఏడాది కళాశాలలో ప్రవేశానికి 'దోస్త్' వెబ్ అడ్మిషన్లు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు. బీఏ, బీకామ్, బీఎస్సీ గ్రూప్‌లలో మొత్తం 60 సీట్ల చొప్పున 240 సీట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. అర్హత కలిగిన విద్యార్థులు డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని శ్రీపాద శార్వాణి పేర్కొన్నారు.

ఒకే విడతలో రుణమాఫీ

కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి

తలకొండపల్లి: ఒకే విడతలో రూ. 2లక్షల రైతు రుణమాఫీ చేయనున్నట్లు కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 15 లోగా చేసి, రైతులకు అండగా ఉంటామని పేర్కొన్నారు. తాము చెప్పిన పంటలన్నింటికి మద్దతు ధర కల్పిస్తామన్నారు. అర్హులైన నిరుపేదలకు నూతన రేషన్ కార్డులు మంజూర్ చేస్తామని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన విజయంతో మెజార్టీ ఎంపీ సీట్లు గెలుచుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు.

కొనుగోలు కేంద్రాలను నిరంతరం కొనసాగించండి

కుల్కచర్ల: రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిరంతరం కొనసాగించి, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కోఆపరేటివ్ ఆఫీసర్ ఈశ్వరయ్య అన్నారు. కుల్కచర్ల, తిర్మలాపూర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వలన రైతులు ఇబ్బంది పడుతున్నారని, వారు నష్టపోకుండా ధాన్యం త్వరగా సేకరించాలని నిర్వాహకులకు సూచించారు. అదే సమయంలో దుమ్ముధూళి, తాలు లేకుండా ధాన్యం తీసుకురావాలని సూచించారు.

వర్షాకాలం వచ్చేస్తోంది..

- ఇప్పటికీ ప్రారంభం కాని పూడికతీత పనులు
- పట్టించుకోని అధికారులు



పూడికతీతకు నోచుకోని మీర్‌పేట మంత్రాల చెరువు

మీర్‌పేట: వర్షాకాలం వచ్చేస్తోంది, వేసవిలో చేపట్టాల్సిన పూడికతీత పనులు చేపట్టడంలేదు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మంత్రాల చెరువు పూడికతీతకు నోచుకోవడం లేదు. గత సంవత్సరం హెచ్‌ఎండీఏ అధికారులు ఆలస్యంగానైనా పనులు ప్రారంభించినప్పటికీ వర్షాలు కురవడంతో తూతూ మంత్రంగా పూడికతీత పనులు చేపట్టి చేతులు దులుపుకున్నారని పరిసర కాలనీలవాసులు పేర్కొన్నారు. ట్రంక్‌లైన్ నిర్మించక ముందు ఎన్నో ఏళ్లుగా సమీప కాలనీల మురుగునీరంతా మంత్రాల చెరువులోకే వచ్చి చేరేది. దీంతో దాదాపు మీటర్నర వరకూ సిల్ట్ పేరుకుపోయింది. ఈ విషయాన్ని గమనించి అధికారులు వర్షాకాలం రాకముందే పనులు చేపట్టాలని కాలనీ పరిసర వాసులు వాపోతున్నారు. ఐనప్పటికీ ఈ విషయంలో అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెరువు పూర్తిగా ఎండిపోయింది..

ఏప్రిల్ నెలలోనే చెరువులో పూడిక తీయాల్సి ఉండగా ఇప్పటివరకు అధికారులు ఆ ఊసే ఎత్తడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఈ సారి ఎండలకు 80 శాతం వరకు చెరువు ఎండిపోయిందని, వేసవి ప్రారంభంలోనే పూడిక తీత పనులు చేపడితే బాగుండేదన్నారు. రెండ్రోజుల క్రితం భారీ వర్షం పడిందని, ఇలాగే వరుసగా మరో మూడ్రోజులు వర్షాలు పడితే చెరువులోకి వరద చేరుతుందన్నారు. ఆ తరువాత పూడికతీత సాధ్యంకాదని చెబుతున్నారు. వర్షాకాలం సమీపిస్తున్నా అధికారులు పూడికతీతపై దృష్టి పెట్టకపోవడంపై చెరువు పరిసర కాలనీలవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నామమాత్రంగా పనులు



చెరువులో సిల్ట్ పేరుకుపోవడంతో పరిసర ప్రాంతాల్లోని భూగర్భ జలాలు తగ్గిపోవడంతో పాటు నీరు కలుషితం అయ్యాయి. గత సంవత్సరం హెచ్‌ఎండీఏ అధికారులు నామమాత్రంగా పూడిక తీసి మధ్యలోనే వదిలేశారు. ఈ సారైనా వర్షాలు పడకముందే పూడిక పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలి.

– ఎద్దు మల్లేశ్ ముదిరాజ్, కార్పొరేటర్



సీఎం రేవంత్‌రెడ్డితో కాంగ్రెస్ నాయకులు

నిధులు విడుదల చేయాలని సీఎంకు వినతి

కడ్తాల్: నియోజకవర్గ అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని సీఎంకి కడ్తాల్, ఆమనగల్లు నాయకులు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో కడ్తాల్, ఆమన గల్లు మండలాలకు చెందిన ముఖ్య నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి పుష్ప గుచ్ఛం అందజేసి సన్మానించారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు విడుదల చేయాలని సీఎంని వారు కోరారన్నారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులంతా కష్టపడి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ అధ్యక్షుడు యాట నర్సింహ, రేవంత్ మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసిఫ్‌అలీ, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

తలకొండపల్లి: మండల సర్వ సభ్య సమావేశాన్ని శనివారం ఉదయం 12 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీకాంత్ శుక్రవారం తెలిపారు. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ సమావేశానికి, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల మండలాధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

పండ్ల దుకాణాలను తొలగించాలని వినతి

తుర్కయంజాల్: సాగర్ రహదారిపై రోడ్డుకు ఇరువైపులా వెలుస్తున్న పండ్ల దుకాణాలను వెంటనే తొలగించాలని కోరుతూ బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కోశాధికారి బచ్చిగళ్ల రమేశ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సామ భీంరెడ్డి, పన్నాల మధుసూదన్ రెడ్డిలు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ బి. సత్యనారాయణ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. గతంలో ఈ దుకాణాలు బీఎన్ రెడ్డి నగర్ నుంచి సాగర్ కాంప్లెక్స్ వరకు ఉండేవని, అక్కడ జరిగిన ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారులు వాటిని పూర్తిగా తొలగించారన్నారు. నూతనంగా ఏర్పాటు చేసుకుంటున్న దుకాణాల వల్ల ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందని వాటిని వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న రమేశ్ తదితరులు

సంక్షేమ పథకాలను అర్హులకు అందించాలి

ఆమనగల్లు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలందరికీ అందించాలని తెలంగాణ సోషలిస్ట్ విద్యార్థి సంఘం రాష్ట్ర కో ఆర్డినేటర్ శంకర్ ఒక ప్రకటనలో కోరారు. సంక్షేమ పథకాల అమలులో సామాన్య ప్రజలకు అన్యాయం జరిగితే సహించమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లకోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రజల నుంచి మళ్లీ దరఖాస్తులను తీసుకుంటుందని పత్రికలలో వచ్చిన కథనాల పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటు అనంతరం 6గ్యారంటీల కోసం ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకున్నారని, మళ్లీ ఇందిరమ్మ ఇళ్లకోసం దరఖాస్తులు తీసుకోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. సంక్షేమ పథకాలను అర్హులైన పేదలకు నేరుగా అందించాలని, దరఖాస్తుల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

కడ్తాల్: మండల పరిధిలోని వాస్‌దేవ్‌పూర్ గేట్ వద్ద గురువారం సాయంత్రం పిడుగు పాటు గురై కలకొండకు చెందిన ప్రవీణ్‌చారి మృతిచెందగా బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శుక్రవారం పరామర్శించారు. కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ప్రవీణ్ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు రూ. 5వేలు తక్షణ సాయం అందజేశారు. ప్రభుత్వ పరంగా సాయం అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. పిడుగు పాటుకు గురై, యెన్నం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాడుగుల మండల కేంద్రానికి చెందిన నిరంజన్ గౌడ్‌ను పరామర్శించారు. నిరంజన్‌గౌడ్‌ను ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం తక్షణ సాయంగా రూ. 5వేలు అందజేశారు. నిరంజన్‌గౌడ్‌కు మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి వైద్యులకు సూచించారు.



కడ్తాల్: నిరంజన్‌గౌడ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కళాకారులకు ఆర్థిక సహాయం...

తలకొండపల్లి: సీతారామాంజనేయ కళా నాట్యమండలి ప్రదర్శకులకు మాజీ సర్పంచ్ బక్కి కుమార్ ఆర్థిక సాయం చేశారు. మండల పరిధిలోని చంద్రధనలో శ్రీకృష్ణ రాయబారం పౌరాణిక పద్య నాటికను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బక్కి కుమార్ వారికి శుక్రవారం నాటక ప్రదర్శన ఖర్చుల నిమిత్తం, ప్రోత్సాహకంగా కళాకారులకు రూ. 10,000 అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కనుమరుగవుతున్న కళలను ప్రదర్శించి బ్రతికిస్తున్నారని కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్, దామోదర్‌రెడ్డి, చిత్తరంజన్, అయ్యప్పచారి, నరసింహ్మాగౌడ్, నరేశ్, విష్ణుమూర్తి, రమేశ్‌చారి, జంగయ్య, శివానంద్, కొమరయ్య, గణేష్, యాదగిరిరెడ్డి, తిరుపతయ్య, ప్రసాద్, భగవంత్, నరసింహగౌడ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.



తలకొండపల్లి: చంద్రధనలో ఆర్థిక సహాయం అందజేస్తున్న కుమార్

పరామర్శ..

మండల పరిధిలోని జూలపల్లికి చెందిన లక్ష్మయ్య మృతిచెందిన విషయం తెలుసుకున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం రూ. 3వేలు ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో జైపాల్ రెడ్డి, రమేశ్, అనిల్ కుమార్, అశోక్, శ్రీరాములు, శాంతయ్య, కొమురయ్య, మహేందర్, శ్రీను, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటండి



దేవుని పడకల్‌లో నర్సరీని పరిశీలిస్తున్న మాజీ సర్పంచ్ శ్రీశైలం తదితరులు

మాజీ సర్పంచ్ శ్రీశైలం

తలకొండపల్లి: ఇంటింటా మొక్కలు విరివిగా నాటి హరిత గ్రామాలుగా మార్చాలని మాజీ సర్పంచ్ శ్రీశైలం పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దేవుని పడకల్ గ్రామంలో ఆయన నర్సరీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను సర్పంచ్‌గా ఉన్నప్పుడు గ్రామంలో నర్సరీ మొక్కల పెంపకాన్ని ప్రారంభించినట్లు గుర్తు చేశారు. మొక్కలు విరివిగా నాటేందుకు తగిన సహాయ సహకారాలు అందజేస్తానన్నారు. మొక్కల పెంపకంతో వర్షాలు సకాలంలో సమృద్ధిగా కురుస్తాయన్నారు. దీంతో వ్యవసాయరంగం గణనీయంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి సహకరించండి

ధారూరు: ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలను అర్హులందరికీ దక్కేలా చూడాలని రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం మండల వ్యవసాయ అధికారి ఝాన్సీలక్ష్మి, ఏఈఓ సంజూరాథోడ్, విద్యుత్ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. రైతు సంక్షేమానికి అధికారుల సహకారం అవసరమన్నారు. పొలాల్లో విద్యుత్ స్తంభాలు ఒరిగి, తీగలు కిందకు వేలాడుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. దీని వలన రైతులు, పశువులకు ప్రాణహాని ఉందని వాపోయారు. వెంటనే వాటిని సరిచేసి, సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు తిరుపతిగారి మల్లేశం, పవన్‌కుమార్, ప్రవీణ్‌గౌడ్, వెంకటేశం, సతీష్‌కుమార్, రాఘవేందర్, సాయిలు, మల్లేశం, రాములు, చిన్నయ్య, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దశల వారీగా పనులు చేపడుతాం



పనులను పరిశీలిస్తున్న కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ ఐలయ్య

కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ ఐలయ్య

తుర్కయంజాల్: దశల వారీగా వార్డులో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు కాంగ్రెస్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోశిక ఐలయ్య తెలిపారు. శుక్రవారం ఆయన సాగర్ రహదారి నుంచి నవభారత్ కాలనీ, రాజ్ రంజిత్ ప్రైమ్ హోమ్స్ వరకు రూ.30 లక్షల వ్యయంతో చేపడుతున్న బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు. అదేవిధంగా కమ్మగూడలోని ఇందిరమ్మ కాలనీ, సరస్వతి కాలనీలో చేపడుతున్న డ్రైనేజీ పనులను పరిశీలించారు. పనులను నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్లలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీ వాసులు పాల్గొన్నారు.

ప్రతీ గింజను కొంటాం

- దళారులను నమ్మి మోసపోవద్దు
- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించండి
- తాండూరు డీసీఎంఎస్ ఇన్‌చార్జి మేనేజర్ ఎల్లయ్య



పెద్దేముల్ మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రం

పెద్దేముల్: రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తాండూరు డీసీఎంఎస్ ఇన్‌చార్జి మేనేజర్ ఎల్లయ్య తెలిపారు. శుక్రవారం మండల పరిధి మంబాపూర్, జనగాం గ్రామాల్లోని ధాన్యం కేంద్రాలను డీసీఎంఎస్, మండల ఇన్‌చార్జి సుదర్శన్‌రెడ్డిలు సందర్శించారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడారు. రైతులు తమ దిగుబడిని దళారులకు విక్రయించి నష్టపోరాదని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో అమ్మి, మద్దతు ధర పొందాలని సూచించారు. ఇప్పటి వరకు తాండూరు నియోజకవర్గంలో సుమారు 498 మంది రైతుల నుంచి 65,336 బస్తాల వరి ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు.

మండలాల వారీగా

పెద్దేముల్ మండలంలో 8,831 బస్తాలు, తాండూరులో 14,336 బస్తాలు, బషీరాబాద్‌లో 9,660, యాలాల పరిధి నుంచి 20వేల బస్తాల ధాన్యం రైతుల నుంచి సేకరించినట్లు అధికారి పేర్కొన్నారు. బార్‌దాన్ కొరత లేదని, ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు లక్షా 50వేల గోనె సంచులు వచ్చాయని, వ్యవసాయ అధికారులు టోకన్‌లు ఇచ్చిన వెంటనే వాటిని రైతులకు పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. ఏ-గ్రేడ్ ధాన్యం రూ.2,203, బీ-గ్రేడ్‌కు రూ.2,183 మద్దతు ధర చెల్లించి, కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. 17 శాతం తేమ ఉన్న రైతులకే ఈ ధర వర్తిస్తుందని, అందరూ సహకరించాలని కోరారు.

తల్లిదండ్రులకు పాదపూజ



పాదపూజ కార్యక్రమంలో మాట్లాడుతున్న అనంతరెడ్డి



హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు

మాడ్గుల: కొత్త బ్రహ్మణపల్లిలో శృతిలయ కల్చరల్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో వేసవి సంగీత నృత్య శిక్షణ శిబిరం ప్రారంభోత్సవ సందర్భంగా వందేమాతరం ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు బట్టు నర్సిరెడ్డి, సభ్యుడు అనంతరెడ్డితో కలిసి తల్లి దండ్రులకు పాదపూజ చేపట్టారు. శుక్రవారం బట్టు నర్సిరెడ్డి, అనంతరెడ్డిలు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం తల్లిదండ్రులకు పాదపూజ చేసి పాఠశాలలకు వెళితే వారి ఆశీస్సులతో మంచి వ్యక్తులుగా తయారవుతారన్నారు. నేటి సమాజంలో తల్లిదండ్రులు, బిడ్డలకు మధ్య అనుబంధం తగ్గుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికి తీయడానికి ఇలాంటి శిక్షణా శిబిరాలు తోడ్పాటునందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో శృతిలయ కల్చరల్ అకాడమీ వ్యవస్థాపకులు చిత్తరంజన్‌దాస్, జీహెచ్ఎమ్ శంకర్, అకాడమీ సభ్యులు శ్రీశైలం, రాజు, శ్రీను,శే ఖర్, మమత, పద్మ, తల్లి దండ్రులు తదితరులు పాల్గొన్నారు.